క్లుప్తంగా

ఘనంగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరం స్వర్ణభారతి ప్లే స్కూల్‌లో శుక్రవారం రాత్రి స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ శైలజ, కరస్పాండెంట్ పి.రాహుల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

పాల్వంచరూరల్: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష(జేఈఈ మెయిన్స్) గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల బాలుర ప్రతిభ జూనియర్ కళాశాల నుంచి 21మంది పరీక్ష రాయగా.. తొమ్మిది మంది వివిధ స్థాయిలో ర్యాంక్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ శనివారం తెలిపారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రతిభా జూనియర్ కళాశాల (సీఓఈ) నుంచి 20మంది పరీక్ష రాయగా ఇద్దరు ర్యాంక్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ అన్వేష్ తెలిపారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంటౌన్: షాపింగ్ మాల్స్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్ జి.పుల్లయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం షాపింగ్‌మాల్స్, షాపులలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే ఆధారంగా అర్హులకు పథకాలు అమలు చేయాలన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

జూలూరుపాడు: గుండెపుడిలో డాక్టర్ సత్య సింధూజ స్కాలర్ నేతృత్వంలో నిర్వహించిన ఉచిత చక్ర సిద్ధ్ వైద్యశిబిరం విజయవంతమైంది. ఈనెల 14న ప్రారంభమైన ఈ శిబిరం శనివారం ముగిసింది. డాక్టర్ సత్య సింధూజ మాట్లాడుతూ... మందులు, శస్త్రచికిత్సలు లేకుండా చికిత్స అందించినట్లు చెప్పారు.

ప్రత్యామ్నాయం చూపండి..

ఇల్లెందు: జేకే సింగరేణి పురాతన క్వార్టర్లలో నివాసం ఉంటున్న జేకే-5 ఓసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేయించరాదని సీపీఎం నాయకులు కోరారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలిసి జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఏ నబీ మాట్లాడారు. కృష్ణ, మోహన్‌రావు, ఆలేటి కిరణ్, వజ్జా సురేష్, అశోక్ పాసీ పాల్గొన్నారు.

స్వామి సేవలు విలువైనవి



ఎంఈఓ స్వామి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందు: విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎం, ఎంఈఓ టీవీఆర్‌ఎన్ స్వామి సేవలు ఎంతో విలువైనవని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్.పూర్ణచందర్‌రావు, పి.శ్రీనివాసరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.హరిలాల్ కొనియాడారు. శనివారం ఇల్లెందు మొయిన్ రోడ్ హైస్కూల్‌లో స్వామి ఉద్యోగ విరమణ, జన్మదిన సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్

పాల్వంచ: ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవానికి (ఈస్టర్) చర్చిలు ముస్తాబయ్యాయి. గుడ్ ఫ్రై రోజు ఏసుక్రీస్తుకు సిలువ వేయగా ఆయన సమాధిలో నుంచి పునరుత్థానుడైన సందర్భంగా ఈ పండుగ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా సీఎస్ఐ, ఆర్‌సీఎం, ఎల్‌జీఎం బెరాకా, క్రీస్తు సువార్త మందిరం తదితర చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆర్‌ఎంపీ మృతి

ఇల్లెందు: ఆంబజార్‌కు చెందిన ఆర్‌ఎంపీ నర్సయ్య (80) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు. 40 ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉన్న ఆయన ఆర్‌ఎంపీ అయినా తొలితరం డాక్టర్‌గా గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ డీవీ, మాజీ వైస్ చైర్మన్‌లు, ఆర్‌ఎంపీలు సంతాపం వ్యక్తం చేశారు.

సింగభూపాలెం చేపలు..

భలే రుచి..

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన సింగభూపాలెం చెరువు చేపల రుచి తెలిసిన వారు పనులు వాయిదా వేసుకుని కొనుగోలుకు పరుగులు తీస్తారు. చేపల కూర రుచిని వర్ణించగలమా..! భూమి తీరో, నీటి తీరో గానీ ఈ చేపలు భలే రుచిగా ఉంటాయని స్థానికులు అంటుంటారు. నెల రోజులుగా మత్స్యకారులు చేపల వేట సాగించి చెరువు ఒడ్డున అమ్ముతున్నారు. ఈ చెరువుపై ఆధారపడి సుమారు 400 మత్స్యకారుల కుటుంబాలు జీవిస్తున్నాయి. నెల రోజులుగా సుమారు 25 టన్నుల చేపలను విక్రయించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ చేపల రుచి చూడాల్సిందేనని పొద్దుపొద్దునే వచ్చి రవ్వ, బొచ్చ, బంగారుతీగ తదితర చేపలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఆ తృష్ణ మీకూ ఉంటే చలో.. సింగభూపాలెం. – సుజాతనగర్

సండే స్పెషల్



చేపలను చూపుతున్న మత్స్యకారుడు



చేపలను వేటాడుతున్న మత్స్యకారులు



వల విసురుతున్న దృశ్యం



బోటులో తెచ్చిన చేపలను ఒడ్డుకు చేరుస్తూ..

సింగరేణి కార్మికులతోనే నడిపించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మ్యాన్ పవర్, సింగరేణి మిషినరీతోనే వీకే ఓసీ నడిపించాలని కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజును టీబీజీకేఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జీఎం కార్యాలయంలో జీఎంకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... డిప్యూటేషన్‌పై వివిధ ఏరియాలకు పంపిన కార్మికులను ఇక్కడకు బదిలీ చేయాలన్నారు. అదేవిధంగా చాలా ఏళ్ల నుంచి సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను నింపడం లేదని వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, కాగితపు విజయ్ కుమార్, మాదాసు ఈశ్వర్, అశోక్, లక్ష్మీనారాయణ, రమేష్, వీరయ్య, రామ్మూర్తి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలపై చర్చించండి..



మాట్లాడుతున్న కృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న సింగరేణి సంస్థ డైరెక్టర్ల సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై చర్చించాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు.శ శనివారం ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని, వారి వేతనాలు పెంచాలని కోరారు. కోలిండియాలోని బొగ్గు పరిశ్రమల్లో 2013 నుంచి హైపవర్ వేతనాలు చెల్లిస్తుండగా, సింగరేణిలో జాప్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో కే.సారంగపాణి, డి.ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, ఎండీ రాసుద్దీన్, ఎన్.సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్‌రావు, రావూరి ఉపేందర్‌రావు, సురేష్, మారుతీరావు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన

ఇల్లెందు: భూ భారతి చట్టంపై ఆదివా రం ఇల్లెందు మండల స్థాయి అవగాహన సమావేశం బొజ్జాయిగూడెం ఎస్‌ఎస్ గార్డెన్‌లో జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ హాజరవుతున్నట్లు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

టేకులపల్లి: భూ భారతి చట్టంపై ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు టేకులపల్లి తహసీల్‌లో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగభవానీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి ఆధ్వర్యంలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణకై శనివారం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై మాట్లాడారు. భారతదేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నంతకాలం ఎవరూ మార్చలేరన్నారు. ఈ కార్యక్రమంలో దళ్‌సింగ్, కూచిపూడి జగన్, ఏనుగుల అర్జున్‌రావు, ఎల్లావుల పాపారావు, పూణెం శ్రీనివాస్, గౌస్‌పాషా, బలరాం నాయక్, బండ వెంకటేశ్వర్లు, ముద్దంగుల శేఖర్, గోలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): రామవరం పాఠశాలలో 150 మంది విద్యార్థులకు శనివారం హెచ్‌ఎం ప్రభుదయాళ్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ... వేసవిసెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా చదువుకోవాలనే సంకల్పంతో పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు.

పాల్వంచ: విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదని, ప్రభుత్వం అందిస్తున్న వేసవి సెలవుల నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.శ్రీరామ్మూర్తి అన్నారు. శనివారం స్థానిక బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలు పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యార్థులకు అందించేందుకు పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోండి..



ఇల్లెందురూరల్: పోషణ పక్షోత్సవంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాల్వంచ ప్రాజెక్టు పరిధిలోని రేగళ్ల సెక్టార్ గంగమ్మకాలనీ క్రాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ శారద, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి అన్నారు. మామిడిగుండాల గ్రామపంచాయతీ సువర్ణాపురం గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. చిరుధాన్యాల వినియోగం, ఆకుకూరలు, ఆరోగ్యం మెరుగ్గా ఉండేలా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, రక్తహీనత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కొమురమ్మ, ఏఎన్‌ఎం మల్లమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకులపల్లి: అంగన్‌వాడీలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు శనివారం బోడు, గంగారం, బొమ్మనపల్లి, సులానగర్, టేకులపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో చింతోని చెలక, కొండెంగులబోడు, తొమ్మిదోమైలుతండా, శాంతినగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా పోషణ్ పక్వాడా వేడుకలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

పాల్వంచ: మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కాంట్రాక్టర్‌లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులు ఏ దశల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... రోడ్లు, డ్రెయినేజీలు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని, నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజలు బాధ్యతగా భావించాలన్నారు. పనుల్లో అలసత్వం ఉండరాదని, నాణ్యతను విస్మరించరాదన్నారు.

పేదలకు సన్నబియ్యం వరం..

పేదలకు సన్నబియ్యం పథకం ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం బాపూజీనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుడు ఎస్‌కె.బాబా ఇంట్లో అధికారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎస్‌కే సాబీర్‌పాషా, నూకల రంగారావు, ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్‌కుమార్, వైఎస్ గిరి, మురళీ, రాంబాబు, మధు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి మృతి.. కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి ముత్తినేని నాగేశ్వరరావు మృతి బాధాకరం అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. శనివారం స్థానిక దమ్మపేట సెంటర్‌లో నాగేశ్వరరావు గృహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

ఖురేషికి డాక్టరేట్..

కొత్తగూడెంఅర్బన్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ నాయకుడు నయీమ్ ఖురేషీ డాక్టరేట్ పురస్కారాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ వారు నయీమ్ ఖురేషీ 15 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్‌ను ప్రకటించారు. ఖురేషి మాట్లాడుతూ.. తన సేవలకు గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు.

భవిష్యత్‌పై ప్రణాళిక ఉండాలి

ఇల్లెందురూరల్: విద్యార్థులు భావి జీవితంలో ఉన్నతంగా ఎదిగేలా భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులతో వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు జీవితంలో స్థిరపడేలా ఉన్నతంగా ఎదిగేందుకు అనే మార్గాలు ఉంటాయని, వాటిల్లో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.ప్రభాకర్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలకు మంచిపేరు తేవాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు మంచిపేరు తేవాలని 35వ వార్డు మాజీ కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. శనివారం కూలీలైన్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మునగ సుజాత, హెచ్‌ఎం గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి..

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. శనివారం గొల్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా రెండు జతల యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. అనంతరం ఎంఈఓ జుంకీలాల్, పాపకొల్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్కే మీరాసాహెబ్‌లను సన్మానించారు. హెచ్‌ఎం మధు, పెంటయ్య, ధరావత్ హనుమా జాదవ్, బాలకృష్ణ, నరసింహా, పి.రవి, రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక బాధ్యత కమిటీలదే..



కమిషనర్ శ్రీకాంత్‌తో చర్చిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సభ్యులు, మాజీ కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బాధ్యత కమిటీలదేనని, అర్హులకు అన్యాయం జరగరాదని, ప్రభుత్వ నిబంధనలు పాటించి ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అవగాహన సమావేశం ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పట్టణంలోని 24 వార్డుల నుంచి ఐదుగురు సభ్యులు చొప్పుల సభ్యులు, వార్డు ఆఫీసర్లతో సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో 72,000 దరఖాస్తులు వచ్చాయని వాటిని మూడు విభాగాలుగా విభజించారని తెలిపారు. ఇంటి జాగా కలిగిన వారు, లేనివారు, అనర్హులు. అవకతవకలకు అవకాశం లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగాలన్నారు. తుది జాబితా కలెక్టర్ రూపకల్పన చేస్తారని తెలిపారు.

కమిటీ సభ్యుల అసంతృప్తి..

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో వార్డుల మధ్య ఎంపికలో వ్యత్యాసం ఉండటం పట్ల కమిటీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ ప్రారంభంలో ఎమ్మెల్యేకు సమాచారం లేదంటూ కొంతమంది ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడి సభను ప్రారంభించారు. ఇదిలా ఉండగా అన్ని వార్డులకు సమానంగా ఇళ్లు కేటాయించాలని సభ్యులు కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ అంకుషావలీ, మాజీ కౌన్సిలర్లు, మాజీ చైర్మన్ డీవీ, వీసీ జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. హిందువులపై దాడులు చేస్తున్న జీహాదీ మూకలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీహెచ్‌పీ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. హిందులపై దాడులను ఆరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గడిదేశి వెంకటేశ్వర్లు, దారా రమేష్, గంగాధరి సీత, సీహెచ్ లక్ష్మయ్య, కూసన సాగర్, రామోజు మధుసూదనచారి, రాయల చందర్‌రావు, అడ్వకేట్ మురళి, భూక్యా మోహన్, మాధవరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు

వరంగల్ సభకు భారీగా తరలిరండి..

చుంచుపల్లి: వరంగల్‌లో ఈ నెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం చుంచుపల్లి బాదావత్ తండాలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాదావత్ శాంతి, బొమ్మిడి శ్రీకాంత్, పెయింటర్ రాజేష్, దుర్గేష్, కన్ని నవతన్, జయరాం, బొమ్మిడి రమాకాంత్, ఓం ప్రకాష్, సదా మోహన్, రవి, పోకల నగేష్, దీపక్, అరవింద్, గద్దం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలు, పాడిపంటలతో ఆనందంగా ఉన్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు పరచడంలో విఫలమైందన్నారు.

అమ్మకాలపై అదనపు బాదుడు..

- సమస్యలకు నిలయంగా 'గూడెం' బస్టాండ్
- యాచకులకు అడ్డాగా మారుతున్న ప్రాంగణం
- ఎవరికీ పట్టని పారిశుద్ధ్యం



కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణం




బస్టాండ్ ఆవరణలో షాపులు

చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికులకు అదనపు బాదుడు తప్పటం లేదు. బస్టాండ్‌లోని దుకాణాలను లీజు ప్రాతిపదికన టెండర్లు పిలిచి ఆర్టీసీ సంస్థ అద్దెకు ఇస్తుంది. నిబంధనల ప్రకారం దుకాణదారులు ఎమ్మార్పీ కంటే మించి వస్తువులు విక్రయించరాదు. బస్టాండ్ షాపుల్లో ఆ పరిస్థితి లేదు. నిర్వాహకులంతా సిండికేట్‌గా ఏర్పడి ధరలు నిర్ణయించి అధిక మొత్తంలో వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. తాగునీళ్లు మొదలు శీతలపానీయాలు, తినుబండారాల వరకు అన్నింటిపై రూ. 5 నుంచి రూ.10 వరకు అదనంగా వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారు. అంతేకాకుండా స్థానికంగా తయారయ్యే కంపెనీలవి మాత్రమే అమ్ముతున్నారు. బ్రాండెడ్ వాటర్ బాటిల్ లీటరు రూ.20 ఉండగా, బస్టాండ్‌లో మాత్రం రూ.25 వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ కంపెనీలవి కూడా బ్రాండెడ్‌లా ముద్రించి రూ.20 చొప్పున అమ్ముతున్నారు. ప్రయాణికులు ఇష్టం లేకున్నా కొనుగోలు చేయక తప్పడం లేదు. ఇదే అదునుగా ఊరూపేరూ లేని బ్రాండ్లు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ దందా యదేచ్ఛగా కొనసాగుతోంది. అధికారులు తనిఖీలు చేసే సమయంలో మాత్రమే అప్రమత్తంగా ఉంటూ కచ్చితమైన ధరలకు అమ్ముతున్నారు. ఆ తర్వాత షరా మామూలే. ఇక నిబంధనల ప్రకారం తినుబండారాల ప్యాకెట్లపై అవి తయారు చేసిన తేదీ ముద్రించాల్సి ఉండగా అది ఎక్కడా కనిపించడం లేదు. బ్రాండెడ్ ఆహార పదార్థాలు, తినబండారాలకు బదులు నాణ్యత లేని నాసిరకమైన ఆహార పదార్థాలు షాపుల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

సమస్యలకు నిలయంగా బస్టాండ్

కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ప్రయాణికులకు తగ్గట్టు సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. రోజువారీ జన సంచారం అధికంగా ఉండటంతో ప్రధానంగా బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్యం లోపించింది. బయట నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలు సైతం ఎక్కడికక్కడే నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిపోయే ప్రయాణికులకు తగ్గట్లు సీటింగ్ సౌకర్యం అంతగా లేవు. నిత్యం కొత్తగూడెం బస్టాండ్ నుంచి 25 వేల నుంచి 30 వేల మంది ప్రయాణికులు ఖమ్మం, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, వరంగల్, కరీంనగర్, ఇల్లెందు, భద్రాచలం ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్లు మరుగుదొడ్లు సైతం అందుబాటులో లేవు. మరుగుదొడ్లకు చెందిన ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో ప్రాంగణమంతా దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్‌లో ఇటీవల బిచ్చగాళ్ల సంచారం పెరిగింది. సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో నిఘా కరువైంది.

అధిక ధరలకు అమ్ముతున్నారు..



వేసవి దృష్ట్యా దాహం వేయటంతో కొత్తగూడెం బస్టాండ్‌లోని షాపులో మంచి నీళ్ల బాటిల్ తీసుకుందామని వెళ్లాను. రూ.20 బాటిల్‌ను రూ.25 చెప్పారు. అదేంటని అడిగితే ఇక్కడ ఇంతే కొంటే కొనండి.. లేకపోతే లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రూ.25 ఇచ్చి కొనుగోలు చేశాను. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జి.నూతన్, ప్రయాణికుడు

చర్యలు తీసుకుంటాం..



కొత్తగూడెం బస్టాండ్‌లో నెలకొన్న పలు సమస్యలపై దృష్టి పెడతాం. సీసీ కెమరాలు ఇంకా కొన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. బయట ప్రైవేట్ వాహనాలను బస్టాండ్ లోపలికి రాకుండా నిరోధిస్తున్నాం. బస్టాండ్‌లోని షాపుల్లో అదనపు అమ్మకాలు జరిపితే జరిమానాలు విధించటమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

– దేవేందర్‌గౌడ్, డీఎం